సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జంగయ్య

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

షాబాద్, జనవరి 18 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సీపీఐ మండల అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ విషయంలో అందరి రుణాలు మాఫీ చేయకుండా, కేవలం 25లక్షల మందికి మాత్రమే రుణాలు మాఫీ చేసిందని ఆరోపించారు. అదే విధంగా రంగారెడ్డిజిల్లాలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అందించాలని కోరారు. ఈ నెల 28వ తేదీన చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సీపీఐ చేవెళ్ల నియోజక వర్గం జనరల్ బాడీ సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.రామస్వామి, మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు రాములు, శ్రీశైలం, నారాయణ, రుక్కయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

న్యాయ పోరాటం కొనసాగిస్తాం

రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, జనవరి 18 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖలా భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నారు. దీక్షలో వారు మాట్లాడుతూ.. పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు తమకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖలా సర్వే నెంబర్ 633 నుంచి 644 వరకు భూములను తమ వద్ద నుంచి అన్యాయంగా లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములు మాకు ఇచ్చే వరకు దీక్ష ఆపేది లేదని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. దీక్షలో రాథోడ్, రెడ్డిరవి, చందర్, పాత్లోత్ లక్ష్మణ్, గోపాల్, నిర్మల, వసుంధర, జంగయ్య, లక్ష్మణ్, టోప్యా, సేవ్యా నాయక్, బంధం సురేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు మర్రివాగు రాజు, కైలాస్, అశోక్, దశరత్, మల్లేశ్, నర్సింహులు, రాఘవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

షాబాద్, జనవరి 18: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో వెల్‌స్పన్ ఫౌండేషన్, ఎల్వీప్రసాద్ కంటి వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 20 మందిని ఆపరేషన్ కోసం, మరో 26మందికి కంటి అద్దాలు అవసరమున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, ఎల్వీప్రసాద్ కంటి దవఖాన నెట్‌వర్క్ కో-ఆర్డినేటర్ సురేందర్‌రెడ్డి, వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, బీసీఐ మేనేజర్ పవన్‌కుమార్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ, దొంగ అరెస్టు

మాడ్గుల, జనవరి18: మండల పరిధిలోని నాగిల్ల గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో ఒక సీసీ కెమెరా, 5 వందల నగదు గురువారం చోరీ జరిగింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడిన గ్రామానికి చెందిన మురళీకృష్ణరెడ్డిని శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. సొమ్మును రికవరీ చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ జగదీశ్ తెలిపారు.

నకిలీ కరెన్సీతో మోసానికి పాల్పడుతున్న విదేశీయుడి అరెస్ట్

హయత్‌నగర్, జనవరి 18: నకిలీ కరెన్సీతో మోసానికి పాల్పడుతున్న ఓ విదేశీయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కమరూన్ దేశానికి చెందిన జాక్యూస్ దేవలాఇస్ కిట్ 2017 జూలైలో రెండు నెలల టూరిస్ట్ వీసాపై భారతదేశానికి వచ్చాడు. అనంతరం స్వదేశానికి వెళ్లకుండా అతడి స్నేహితుడి పాస్‌పోర్టుపై కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉన్నాడు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. జాక్యూస్ దేవలాఇస్ కిట్ అసలు కరెన్సీని పొందిన తర్వాత వారిని మోసం చేసి అక్కడి నుంచి తప్పించుకునేవాడు. 2020లో బెంగుళూరులో ఇదే తరహాలో వ్యాపారం చేస్తుండగా కర్ణాటక పోలీసులు అతడిని పట్టుకుని హున్నూరు పీఎస్‌లో కేసు నమోదు చేశారు. 420 ఐపీసీ, విదేశీయుల చట్టం 1946లోని 14 కింద అతడిని రిమాండ్‌కు తరలించారు. అదే పద్ధతిలో హయత్‌నగర్‌లోని చైత్ర ఒయో లాడ్జిలో రసూల్‌ను మోసం చేస్తుండగా హయత్‌నగర్ పోలీసులు జాక్యూస్ దేవలాఇస్ కిట్ ను పట్టుకున్నారు. నిందితుడి వద్ద పాస్‌పోర్టుతోపాటు మొబైల్, 4 ఐదువందల ఒరిజినల్ కరెన్సీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాగు భూములకే రైతు భరోసా

షాద్‌నగర్‌టౌన్, జనవరి 18: రైతు భరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం కానీ భూములను శనివారం ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట, చౌలపల్లి, చింతగూడెం, మధురాపూర్ గ్రామాలను వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవన్యూ అధికారులతో కలిసి సందర్శించి రెవెన్యూ గ్రామ పరిధిలో సాగుకు యోగ్యంకాని వెంచర్, పరిశ్రమల, మైనింగ్, రోడ్లు, గుట్టలకు సంబంధించిన భూములను పరిశీలించారు. సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించి ఆయా భూముల జాబితాను గ్రామ సభలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వీటి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సాగుకు యోగ్యంకాని భూములను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్

కొనసాగుతున్న రైతు భరోసా సర్వే

మంచాల : ప్రతి రైతుకు రైతు భరోసా ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో భూములను సర్వే చేస్తున్నామని తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు అన్నారు. మంచాల మండలం లోయపల్లి గ్రామంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ నజీర్, ఏఈవో లింగస్వామి, రెవెన్యూ అధికారి యాట భాస్కర్‌లు నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయికి వెళ్లి భూముల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద వ్యవసాయ భూములకు రైతు భరోసా అందజేస్తామని చెప్పారు.

బాధిత రైతులకు భూములివ్వాలి

బాధిత రైతులను కలిసిన సీపీఎం నాయకులు

యాచారం, జనవరి18: గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భాగంగా భూములు కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వం భూమికి భూమి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కుర్మిద్దకు అనుబంధంగా ఉన్న మర్లకుంటతండా, మంగలిగడ్డతండా, పోతుబండతండాల్లో సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో భాగంగా కోల్పోతున్న భూములను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న బాధిత రైతులకు భూమికి బదులుగా భూములివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూమి ఇవ్వలేని పక్షంలో 2013చట్టం ప్రకారం మార్కెట్ ధర కంటె మూడు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. బలవంతంగా భూములు లాక్కుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

పార్కు ఓపెనింగ్‌కు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

బడంగ్‌పేట, జనవరి18: మీర్‌పేట 28వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కు ఓపెనింగ్‌కు రావాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి ఆహ్వానం అందజేశారు. మీర్‌పేటలో చెరువులు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఎమ్మెల్యే కృషితోనే ఏర్పాటు చేసినవి అని అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి అయిందంటే సబితా ఇంద్రారెడ్డి చొరవ అన్నారు. ఈనెల 20న పార్కును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

నలుగురి దుండగులకు రిమాండ్

మొయినాబాద్, జనవరి18: రాత్రి వేళలో గోడౌన్ షెట్టర్, తలుపులు, బీరువా తాళాలు పగుల గొట్టి భారీ నగదును దోచుకెళ్లిన ఘటనలో దొంగలను మొయినాబాద్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండల కేంద్రంలోని భరద్వాజా కాలనీలో ఉన్న పద్మావతి అసోసియేట్ స్టోరేజ్ గోడౌన్‌లో ఈ నెల 15న రాత్రి దొంగతనం జరిగింది. రూ.6లక్షలు నగదు అపహరించగా, 16న గోడౌన్ ఇన్‌చార్జి వినిత్‌రెడ్డి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం నలుగురు దొంగలను పట్టుకున్నారు.

పది రోజుల క్రితమే పథకం

రాజస్థాన్‌కు చెందిన సైతాన్ రామ్ మొయినాబాద్‌లో కిరాణ షాపు నిర్వహిస్తున్నాడు. తనకు అవసరమైన సరుకులకు భరద్వాజ కాలనీలో ఉన్న పద్మావతి అసోసియేట్ స్టోరేజ్ గోదాం నుంచి తెచ్చుకునే వారు. ఈ క్రమంలో గోదాంకు ఎదురుగా ఉన్న మెకానిక్ షాపులో పని చేసే రాజాస్థాన్‌కు చెందిన పరమేష్‌తో కలిసి గోదాంలో దొంగతనం చేయాలని 10 రోజుల ముందు పథకం పన్నారు. ఇందుకోసం రాజాస్థాన్‌కు చెందిన మరో ఇద్దరిని సిద్ధం చేశారు. కొంపల్లిలో ఉండే హుల్లాస్ మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో వాచ్‌మెన్‌గా పని చేసే భవాని సింగ్‌ను దొంగతనం చేయడానికి పిలిపించారు. 15వ తేదీన అర్ధరాత్రి హుల్లాస్, భవానిసింగ్ ఇద్దరు గోదాం షట్టర్ ధ్వంసం చేసి బీరువాను విరగొట్టి అందులో ఉన్న రూ.6 లక్షల నగదును దోచుకెళ్లారు. అప్పటి వరకు సైతాన్‌రామ్ , పరమేశ్వర్‌లు ఫామ్ హౌస్ వద్ద మహేంద్ర బొలెరో వాహనంలో వేచి ఉన్నారు. దొంగతనం చేసిన డబ్బులు తీసుకుని రాగానే నలుగురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. శనివారం నలుగురి దొంగలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బొలెరో వాహనం, ఆక్టివా, 4 సెల్ ఫోన్లు, రూ.2.96 లక్షల నగదు, దొంగతనానికి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మహాసభల వాల్ పోస్టర్ విడుదల

సీపీఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి యాదయ్య, తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్ : ఈ నెల 25నుంచి 28వరకు నాలుగు రోజుల పాటు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. శనివారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ..నాలుగురోజుల పాటు నిర్వహించే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు ముసిలయ్య, శంకర్, విజయ్, ప్రబుదాసు, యాదగిరి, వీరేశ్, రాఘవేందర్, సయ్యద్ రజాక్‌పాషా, తదితరులున్నారు.

చేవెళ్ల రూరల్ : సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధి కందవాడ అనుబంధగ్రామం నారాయణదాస్‌గూడ గ్రామంలో గ్రామ కార్యదర్శి మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఐ పేదల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. ఈనెల 28వ తేదీన చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో చేవెళ్ల నియోజకవర్గం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రజా సంఘాల నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని.. ఏఐటీయూసీ కార్యదర్శిగా హాసన్, రైతు సంఘం కార్యదర్శిగా బాల రాజ్, మహిళా సంఘం కార్యదర్శిగా కళావతి, ఆండాలును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, కందవాడ గ్రామ కార్యదర్శి ఎలీషా, నాయకులు బీరప్ప, శ్రీకాంత్, రామచందర్, నర్సింహులు, బాలరాజ్, లలిత, మీనాక్షి, సుగుణమ్మ పాల్గొన్నారు.

నారాయణదాస్‌గూడలో సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

యువత క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జనవరి18 : యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నారు. మండలంలోని మజీద్ మామిడిపల్లి గ్రామంలో సుదర్శన్, గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు.

రేషన్ కార్డుల సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే

మండలంలోని అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, మొదళ్లగూడ, మామిడిపల్లి గ్రామాల్లో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వేను ఎమ్మెల్యే శంకర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కృష్ణయ్యను ఎమ్మెల్యే శంకర్ పరామర్శించి రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కృష్ణ, కుమారస్వామిగౌడ్, నాయకులు రాంరెడ్డి, నర్సింహ, కృష్ణ, ఏఎమ్‌సీ డైరెక్టర్ మల్లేశ్, సీతారాం, సుదర్శన్, నవీన్‌గౌడ్, యాదగిరిరెడ్డి, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ, మాజీ వార్డు సభ్యుడు

కడ్తాల్, జనవరి 18: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని గీతా కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. అనంతరం టోర్నీ విజేత 11 స్టార్ జట్టుకు శ్రీనివాస్‌గౌడ్ రూ.30,116లు, రెండోవ స్థానంలో నిలిచిన చౌహన్ జట్టుకు మాజీ వార్డు సభ్యుడు రాందాస్‌నాయక్ రూ.16,116తోపాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు హీరాసింగ్, రెడ్యానాయక్, తులసీరాంనాయక్, రాజేశ్, బిక్కు, అమర్‌సింగ్, శివకుమార్, సాయి, సుధీర్, సుమన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

మూగజీవానికి చికిత్స చేస్తున్న వైద్యురాలు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 18 : గ్రామీణ ప్రాంతాల్లో పశువుల సంరక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని ఇబ్రహీంపట్నం పశువైద్యశాల సహాయ సంచాలకులు, ఎలిమినేడు పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో శనివారం 40పశువులకు గర్భకోశవ్యాధులకు సంబంధించిన చికిత్స, 30 పశువులకు సాధారణ వ్యాధుల చికిత్స, 60మూగజీవాలకు నట్టల నివారణ మందులు, 105 పశువులకు లంపిస్కిన్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మూగజీవాలకు సోకే వ్యాధులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పశువైద్యాధికారుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల మిత్రులు జగన్, శంకర్, సురేందర్, సతీశ్ పాల్గొన్నారు.

అన్నిదానాల్లో అన్నదానం గొప్పది

కడ్తాల్, జనవరి 18: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సీనియర్ సభ్యుడు గంప శ్రీను తన తల్లి వీరమణి వర్ధంతి సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని ఎల్‌సీఐఎఫ్ ఏరియా కోఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డితో కలిసి డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదన్నారు. అనంతరం 360 మందికి అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, క్లబ్ కార్యదర్శి మహేశ్, పీఆర్వో పాషా, గోవర్ధన్‌రెడ్డి, పాండునాయక్, మహేశ్, అంజి, సురేశ్, శ్రీను, వీరేంద్ర పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆర్టీసీ డ్రైవర్లను సన్మానించిన ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య

మలక్‌పేట, జనవరి 18: ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మూసారాంబాగ్‌లోని ఈస్ట్‌జోన్ ఆర్టీవో కార్యాలయంలో దిల్‌సుఖ్‌నగర్, మిధాని, కాచిగూడ డిపోలకు చెందిన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. నిత్యం ప్రజా రవాణా విధులను నిర్వహించే ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించటం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చునని అన్నారు. అధిక వేగం, సిగ్నల్ జంపింగ్, రాంగ్‌రూట్లో వెళ్లటం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపటం, సీటు బెల్టు ధరించకుండా డ్రైవింగ్ చేయటం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయటం, ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై తిప్పటం వంటివి అన్ని ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కిందకే వస్తాయని, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019ల ప్రకారం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు పాల్పడితే లైసెన్సులు రద్దుచేసి కేసులు నమోదుచేయించి జరిమానలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. అతివేగం ప్రమాదకరమని, స్పీడ్ థ్రిల్ నిస్తుందని, కాని కిల్ కూడా చేస్తుందని ఆయన వివరించారు. ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసేముందు ఒక్కసారి మీపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్, పర్మిట్లు, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరని ఆయన అన్నారు. 33 ఏండ్లుగా జీరో యాక్సిడెంట్(ఎలాంటి ప్రమాదాలు లేకుండా) డ్రైవింగ్ చేస్తున్న దిల్‌సుఖ్‌నగర్, మిధాని, కాచిగూడ డిపోలకు చెందిన డ్రైవర్లను ఈ సందర్భంగా ఆర్టీవో కిష్టయ్య, అధికారులు శాలువాలతో సన్మానించారు. ఎంవీఐలు రమేశ్‌బాబు, రాధిక, నరేంద్రపాల్, బలరాం, ఏఎంవీఐలు మధుసూదన్‌రెడ్డి, జాన్, అష్పాక్ అహ్మద్, ఏఓలు అంజుం, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది విమలాకుమారి, శైలజ, అరుణ్, శ్రీకాంత్, వినయ్, ఎంఏ కరీం, అరుణ, విజయ పాల్గొన్నారు.

దివ్యాంగుల భూములను కబ్జా నుంచి కాపాడాలి

కందుకూరు, జనవరి 18 : దివ్యాంగులకు న్యాయం చేయాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్ రావు కోరారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో దివ్యాంగుల భూములను కబ్జా నుంచి కాపాడాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన దివ్యాంగులు దివంగత ఎడ్ల జంగయ్య కూతుర్లు పద్మావతి, హైమావతి, పరమేశ్వరి, రామేశ్వరిల 9,16ఎకరాల భూమిని 20సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన బావ గొరెంకల యాదయ్య, అన్న క్రిష్ణయ్యలు కబ్జాలో ఉంటున్నారని తమ భూములు తమకు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. దివ్యాంగుల భూములు కాజేయడానికి యత్నిస్తున్న, బావ, అన్నలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారి భూములను వారికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అందె రాంబాబు, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి ప్రధాన కార్యదర్శి ముత్యాలు మాదిగ, యాచారం జంగయ్య పాల్గొన్నారు.

పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్

పాఠశాల పని దినాల్లో వీఎం హోంలో జరుగుతున్న సినిమా షూటింగ్

ఆర్కేపురం, జనవరి 18 : పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్‌లకు అక్రమంగా అనుమతి ఇచ్చి విద్యార్థుల హక్కులకు భంగం కలిగించిన వీఎం హోం కార్యదర్శి కిషన్, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, ప్రిన్సిపాల్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని వీఎం హోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమ సంపార్జన కోసం విద్యార్థుల చదువులు ఫణంగా పెట్టడం, బాలల హక్కులకు భంగం కలిగించిన విషయంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సభ్యులు అంజన్‌రావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎం హోంలో యథేచ్ఛగా బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని చెప్పారు. పాఠశాల పని దినాల్లో షూటింగ్‌లకు అనుమతి ఇవ్వడం వల్ల తరగతి గదులు, ఆవరణ మొత్తం సినిమా షూటింగ్ బృందం తీసుకుని కనీసం పిల్లల బాత్రూంలకు క